# భార్యలూ! క్షమించండి!

సోమసుందరం భార్యకి బ్రెస్ట్ కాన్సరట! ఈ వార్త గాలికన్నా వేగంగా ఆఫీసంతా పాకిపోయింది. సోమసుందరానికి చాలా దగ్గర స్నేహితుడు లేదా అతని ఏకైక స్నేహితుడు చిదంబరం ఆరోజే సెలవులో నుంచి తిరిగొచ్చి ఈ వార్తవిని నిశ్చేష్టుడై వెంటనే సోమసుందరం ఇంటికి పరుగెత్తాడు. అప్పుడే భోంచేసి వక్క పొడి నములుతూ, భుక్తాయాసంతో వాలు కుర్చీల్లో కూర్చున్న సోమసుందరం చిదంబరాన్ని చూసి "ఏరా ఎప్పుడొచ్చావ్?" అంటూ లేచొచ్చి పలుకరించాడు. చిదంబరం ఏడుపు మొహంతో బాధగా, బాగానే వున్నానురా! నువ్వెలా వున్నావ్?" అడిగాడు. నసుగుతూ సోమసుందరం మొహంలోకి చూస్తూ.

"బాగానే ఉన్నానురా" అన్నాడు మామూలుగా నవ్వుతూ సోమసుందరం.

"మరి వొదినగారెలా వున్నారు?" భయపడుతూ మెల్లగా అడిగాడు చిదంబరం.

"వదిన గారెవరు?" ఆలోచిస్తూ నుదురు చిట్లించాడు సోమసుందరం.

"అదేరా! మీ ఆవిడ! బొత్తిగా ఇంత ట్యూబ్ లైట్ వయిపోయావేంటి?" కసిరాడు చిదంబరం.

"ఆవిడకేం? నిక్షేపంలా ఉంది. ఒసేవ్? రాజేశ్వరీ, రాజేశ్వరీ! మా ఫ్రెండొచ్చాడు కాస్త కాఫీ పట్రా" అంటూ అరిచాడు.

కాస్సేపట్లో రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయింది రాజేశ్వరి.

చిదంబరం ఆవిడకేసి ఎగాదిగా చూశాడు. ఆవిడ బాగానే ఉన్నట్టుగా కనిపించింది.

కాఫీ సిప్‌చేస్తూ అడిగాడు చిదంబరం. "ఒరేయ్, ఎందుకురా అందరూ నన్నలా అడిగారు? ఆఫీసులో కాలు పెట్టానో లేదో అందరూ నా చుట్టూ పోగయి "సోమసుందరం నీ ఫ్రెండు కదా నీకు తెలీదా? వాళ్లావిడకి కాన్సరట కదా" అన్నారు.

"నాకు తెలీదు" అన్నాను.

"నీకు కూడా తెలీదా?" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"అబద్ధం చెబుతున్నావు కదూ?" అన్నాడు రాజలింగం.

"నాకు ఏడుపొచ్చినంత పనయింది. అందుకే వెంటనే ఇక్కడికి వచ్చేశాను. ఒరేయ్! నిజం చెప్పరా, వొదినగారి ఆరోగ్యం బాగానే వుంది కదా?" అన్నాడు.

సోమసుందరం పెద్దగా నవ్వుతూ" అదా నీ సందేహం? ఒరేయ్! సడన్‌గా మా చెల్లెలికి రెండువేలు కావాలని రాసిందిరా! నాకూ మా సరోజ కాలేజీ ఫీజుకీ, రఘు కాలేజీ ఫీజుకి డబ్బులు కావాలి. అంతే కాదు. మా ఆవిడ ఎప్పటినుంచో తనకో జత గాజులు చేయించి పెట్టమని కోరుతోంది. ఎప్పటికప్పుడూ డబ్బు లేదని దాటేస్తూ వొచ్చేను. వొచ్చే నెలలో వాళ్ళ తమ్ముడి పెళ్ళుంది. అప్పటికైనా నాకు గాజులు చేయించి పెడతారా లేదా అని ప్రాణం తీస్తోంది. రెండు మూడు చోట్ల అప్పు పుడుతుందేమోనని ప్రయత్నించి చూశాను. లాభం లేకపోయింది. ఇక చేసేది లేక ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనల్, విత్‌డ్రాయల్ కోసం పెడదామనుకున్నాను.

ఒరేయ్! మన డబ్బు మనకివ్వడానికి అన్ని వెధవ రూల్సేమిటిరా? ఆ ప్రావిడెంట్ ఫండ్‌కి!

పై చదువులకోసం పిల్లలకీ అని రాస్తే, సర్టిఫికెట్ తెమ్మంటారు. ఇంటి రిపేర్స్‌కి అంటే ఇటుకల బిల్లూ, సున్నంబిల్లూ లేనిపోని గొడవలేవో పెడాలి. సులభంగా డబ్బురావాలంటే 'నా భార్య చాలా కాలంగా అనారోగ్యంతో దీర్ఘకాల వ్యాధితో బాధపడుతోంది. అని రాస్తే వెంటనే డబ్బిచ్చేరు. చిదంబరం! ఇదేం ఖర్మేయ్! ప్రభుత్వం తమ ఉద్యోగులు జాగ్రత్తగా డబ్బు దాచుకునేలా చెయ్యడం కోసం ఇంత పగడ్బంధీ ఏర్పాట్లు చేసుండవచ్చును. కానీ, ఈ రోజుల్లో ఆకాశాన్నంటే ధరలతో చాలీచాలని జీతంతో అవస్థపడుతూ ఏదైనా సరదాలు తీర్చుకోవడంకోసం, రేడియోనో, టి.వి.నో కొనుక్కోవాలన్నా, ఏవైనా ఇంటికి కావలసిన వస్తువులు కొనుక్కోవాలన్నా, ప్రావిడెంట్ ఫండ్ డబ్బు కాస్త తీసుకోవాలంటే. చచ్చినట్టు నా భార్యకి దీర్ఘకాల అనారోగ్యం అని

రాయాల్సిందే. రాయకపోతే పని జరుగదు. అలా రాస్తున్నప్పుడు లేని రోగం వుందని మనసెంత బాధపడుతుందో చెప్పలేను.

నిజానికి ఈ ప్రావిడెంట్ ఫండ్ విత్‌డ్రాయల్ కోసం పెట్టుకున్న వాళ్లలో నూటికి తొంభై మంది ఇదేమాట రాస్తారు. ఇది అబద్ధమనీ, డబ్బుకోసమే అలా రాశారనీ ప్రభుత్వానికీ తెలుసు. అయినా ఆ రూలు మార్చరే? ఏ అవసరానికైనా మీ డబ్బు మీరు తీసుకోవచ్చు అన్న రూలు వుంటే నిక్షేపంగా వున్న భార్యలని జబ్బుగావున్నారని చెప్పి బజారుకి లాగక్కర్లేదే? ప్రతీ ప్రభుత్వోద్యోగి తన సర్వీసులో కనీసం ఒక్కసారైనా తన భార్య దీర్ఘకాల వ్యాధితో బాధపడుతోందని రాసుకునే అవసరం తప్పుతుందే?" బాధగా నిట్టూర్చాడు సోమసుందరం.

చిదంబరం కూడా అవునన్నట్టుగా తలూపుతూ బాధగా నిట్టూర్చాడు.

"కాస్సేపు కూర్చుని వెళ్లరా ఎలాగో వొచ్చావుకదా?"

"మరి ఆఫీసో?"

"ఇవ్వాళ ఇద్దరం క్యాజువల్ లీవ్ అప్లికేషన్ పంపించేద్దాం. హాయిగా మా శ్రీమతి చేసిన టిఫిన్ తిని కాఫీ తాగి, మధ్యాహ్నం మ్యాట్నీకి వెళదాం. రోజూ వుండే ఆఫీసే, రోజూ వుండే గొడవలే." అన్నాడు సోమసుందరం.

"క్యాజువల్ లీవు లెటర్‌లో ఏంరాద్దాం. మన భార్యలకి వొంట్లో బాగోలేదనా?" నవ్వాడు చిదంబరం.

"నో! వేరే ప్రైవేటు పన్లున్నాయి కాబట్టి రాలేకపోతున్నానని రాస్తే సరి!" అన్నాడు సోమసుందరం!

"పాపం! భార్యలు, మన ఉద్యోగాలు కావుగానీ వాళ్ల ఆరోగ్యం బాగులేదని మిషపెట్టడం అన్యాయం సోదరా!

భార్యలూ క్షమించండి! "అని నమస్కారం పెట్టాడు చిదంబరం నవ్వుతూ!

అప్పుడే సోమసుందరం భార్య రాజేశ్వరి వేడివేడి అరటికాయ బజ్జీలూ! కాఫీ పట్టుకొచ్చి "అన్నయ్యగారూ తీసుకోండి" అంటూ అందించింది.

చిదంబరం నవ్వుతూ ప్లేటు అందుకున్నాడు. *